

పోరాటాలకు సమాయత్తం కావాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. -8లో



సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు!

సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. సోమవారం నమోదైన 3, 055 క్యూసెక్కుల ప్రవాహం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.540
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 423 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సౌమ్యనాథస్వామికి రూ.6, 06,780 ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 40 రోజులకు సంబంధించి వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.6,06,780 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు చెప్పారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్ధన, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టు డిపాజిట్లు రూ.2,24,13,591



సమావేశంలో మాట్లాడుతున్న రామసుబ్బన్న

నందలూరు: మండలంలోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం సమీపంలోని సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు డిపాజిట్లు బ్యాంకు ఖాతాల్లో రూ.2,24,13,591 ఉన్నట్లు ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శనివారం, ఆదివారం అన్నదానం నిర్వహిస్తున్నామని, శుక్రవారం కూడా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు చెప్పారు.అన్నదాన సత్రంలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శైలేంద్రనాథ్, సభ్యులు గంట వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, పల్లె సుబ్రమణ్యం, సర్దార్ హుస్సేన్, మోడపోతుల రాము, లంకాయగారి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



చెరువులో చేపపిల్లలు వదులుతున్న అధికారులు

పీలేరురూరల్: జిల్లాలో దోమల నివారణే లక్ష్యంగా 60 వేల గంబూషియా చేపపిల్లలు చెరువుల్లో వదిలినట్లు జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీలో మొరవపల్లె చెరువులో గంబూషియా చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిలో ఉన్న లార్వాను గంబూషియా చేపలు తినడం ద్వారా దోమలు నివారించవచ్చునని తెలిపారు. ఒక్కో గంబూషియా చేప నోటి ద్వారా 300 చేపపిల్లలను విడుదల చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, శ్రీనివాసులు, సిబ్బంది మనోహర్, శివప్రసాద్, వెంకటరత్నం, ఫామున్నీషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



చాకిబండ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య

చిన్నమండెం: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ లక్ష్మీనరసయ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం చిన్నమండెం మండలం చాకిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటినిల్వలు లేకుండా చేయాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది పలు రకాల జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయంపై వివక్ష

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాకు అనిబిసెంట్ యూనివర్సిటీ ఇచ్చిన ఘనత
- జీవో జారీకి కృషి చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి
- పీజీ కోర్సులు ప్రారంభానికి అనుమతి
- గత టీడీపీ ప్రభుత్వం నుంచే కళాశాల మనుగడ లేకుండా చేసే యత్నాలు



బీటీ కళాశాలలో మూతపడిన పీజీ కోర్సు భవనాలు

మదనపల్లె: పేద విద్యార్థులకు విద్యా నిలయమైన చరిత్మాత్మక బీసెంట్ థియోసాఫికల్ కళాశాల అభివృద్ధికి, అన్నమయ్య జిల్లాకు తొలి విశ్వవిద్యాలయంగా అనిబిసెంట్ యూనివర్సిటీ ఏర్పాటులో రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి కృషి మరువలేనిది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్‌గా ఉన్న బీటీ కళాశాలను ప్రభుత్వంలోకి విలీనం చేయడం, తర్వాత జిల్లాల విభజనతో యూనివర్సిటీ లేని అన్నమయ్యజిల్లాకు తొలి విశ్వవిద్యాలయంగా ప్రభుత్వ ఉత్తర్వులు తేవడం..నివేదికలు సిద్ధం చేయడం నుంచి ప్రభుత్వస్థాయిలో అన్ని అనుమతులు పొందడం కోసం మిథున్‌రెడ్డి స్వయంగా కృషి చేశారు. అయితే ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యా సుగంధాలు వెదజల్లాల్సిన బీటి కళాశాల ప్రాభవం కోల్పోవడానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం పడిందని చెప్పవచ్చు. అప్పట్లో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి కళాశాల వ్యవహారాల్లో అధికారిక భాగస్వామిగా ఉన్నప్పుడు దీనిని దక్కించుకోవాలన్న ముందుచూపుతో పీజీ కోర్సుల కాషన్ డిపాజిట్లు వెనక్కు తీసుకోవడం లాంటి చర్యలు చేపట్టడం గమనార్హం.

జగన్ పాలనలో విశ్వవిద్యాలయం

బీటీ కళాశాల బిసెంట్ సెంటినరీ ట్రస్ట్ (బీసీటీ) పర్యవేక్షణలో ఉండేది. దీనికి మదనపల్లెలో మొత్తం 47.36 ఎకరాల భూమి ఉండగా ఇందులో 11.85 ఎకరాల్లో కళాశాల భవనాలు, మధ్యలో ఖాళీ స్థలాలు, మైదానం ఉన్నాయి. ఇది ఎయిడెడ్ కళాశాలగా లక్షల మంది విద్యార్థులకు విద్యనందించింది. దీనిని ప్రభుత్వంలోకి విలీనం చేయాలన్న విద్యార్థి సంఘాల ఆందోళనలు, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో ఆ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో 2022 ఆగస్టు 8న జీవో అయ్యి డిగ్రీ కళాశాల ప్రభుత్వపరంగా కార్యకలాపాలు మొదలయ్యాయి. 2023 నవంబర్ 14న బీటీ కళాశాలను అనిబిసెంట్ విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది. పీజీ కోర్సులు ప్రారంభించాలని, దశలవారీగా కోర్సులను పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టాలని, విశ్వవిద్యాలయ కార్యకలాపాల కోసం అవసరమైన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, మౌలిక సౌకర్యాల కోసం నివేదించాలని జీవోలో ప్రభుత్వ కోరింది.

పట్టించుకోని అధికారులు

విశ్వవిద్యాలయం సౌకర్యాల కోసం అప్పటి విద్యాశాఖ ఉన్నతాధికారులు సరైన రీతిలో స్పందించలేదన్న వాదన వినవస్తోంది. రీజియన్ స్థాయి నుంచి కిందిస్థాయి ఉన్నతవిద్యాశాఖ అధికారులు దీనిపై ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ కళాశాలను దక్కించుకోవాలన్న వ్యూహంలో ఉన్న టీడీపీ మద్దతుదారుల ఒత్తిళ్లతో ఉన్నతాధికారుల చర్యలు ఆగిపోయినట్టు ఆరోపణలు వినవచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, స్థానికంగా ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రజల్లో పేరుప్రతిష్టలు రానివ్వకుండా వ్యవహరించిన ఫలితంగా ఇప్పుడు పేద విద్యార్థులు, విశ్వవిద్యాలయ సౌకర్యాలు అందుబాటులో లేక తీవ్రంగా నష్టపోతున్నారు. పీజీ కోర్సులపై దృష్టి పెట్టలేదు. కళాశాల అభివృద్ధిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు.


» 150కి పడిపోయిన సంఖ్య

బీటి కళాశాల ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నప్పటికీ వెయ్యి మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ సంఖ్య కేవలం 150 మందికి పడిపోయింది. దీనిని బట్టి కూటమి ప్రభుత్వం బీటీ కళాశాలను పట్టించుకోకుండా ఏస్థాయిలో నిర్లక్ష్యం చేస్తోందో అర్థమవుతుంది. 1915లో ఐరిష్ వనిత అనిబిసెంట్ బీటీ కళాశాలను ప్రారంభించి..ఈ కాలేజీ వేదికగా హోంరూల్ ఉద్యమాన్ని నడిపారు. శతాబ్దకాలంలో లక్షల మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఇక్కడ చదివిన వారిలో సీఎంలు, గవర్నర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిన వారు, ఎన్నో రంగాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించిన వారు ఉన్నారు. అంతటి గొప్పదైన కళాశాలను ప్రస్తుతం ఈ దుస్థితికి తీసుకొచ్చారు.

» టీడీపీ పాలనలోనే వ్యూహం

వందలకోసం విలువైన ఆస్తులు, చెక్కుచెదరని భవనాలు కలిగిన బీటీ కళాశాలను ఎప్పటికైనా దక్కించుకోవాలన్న లక్ష్యంతో ఉన్న టీడీపీ మద్దతుదారులైన ఒకరిద్దరు గత టీడీపీ పాలన నుంచే వ్యూహం అమలు చేసినట్టు తెలుస్తోంది. దీంతో అప్పట్లోనే ఇక్కడ నడుస్తున్న పీజీ కోర్సులకు సంబంధించి యూనివర్సిటీలోని కాషన్ డిపాజిట్లను వెనుక్కు తీసుకుని పీజీ కోర్సులు లేకుండా నిర్వీర్యం చేశారని తెలుస్తోంది. దీని ప్రభావం ఏటా విద్యా సంవత్సరంపై పడుతూ చివరకు కళాశాలలో పీజీ కోర్సులే లేకుండా పోయాయి. ఈ ప్రభావం ఇంటర్ కళాశాలపైనా పడింది. ఆ కళాశాల కూడా లేకుండా మూతపడింది. 2022లో ప్రభుత్వపరం కావడం, 2023లో విశ్వవిద్యాలయం జీవో వెలువడగా ఆ ఏడాదిలోనే ఉన్నత విద్యాశాఖ రీజియన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆధీనంలో అభివృద్ధి జరగకూడదని ఆశించే వారి వ్యూహాలకు కళాశాలను బలి చేశారు. జీవో మేరకు సూచించిన చర్యలు తీసుకోక నిర్లక్ష్యం చేయడం, తర్వాత ఎన్నికలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీటీ కళాశాలకు ఈ దుస్థితి తీసుకురాగా, విశ్వవిద్యాలయం ఊసే లేకుండా చేశారు.

» కోల్పోయిన కోర్సులు



పీజీ: ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ తెలుగు, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకాం రెండు సెక్షన్లు, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఫిజిక్స్, ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్

సెల్ఫ్ ఫైనాన్స్: ఎంపీసీఎస్,ఎంఎస్‌సీఎస్, బయో టెక్నాలజీ, బీసీఏ

ఇంటర్: సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఎంపీసీ

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

రాయచోటి జగదాంబసెంటర్: మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సీఐటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య తెలిపారు. మంగళవారం రాయచోటిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పదో రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల మనోభావాలకు అనుగుణంగా జీతాలు అరకొర పెంచి 124 జీఓ విడుదల చేశారన్నారు. వేతనాలు ఎప్పటి నుంచి పెంచుతున్నారో జీఓలో లేదన్నారు. మున్సిపల్ రాష్ట్ర ముఖ్య అధికారులు ఆగస్టు 3 వరకు అందుబాటులో లేనందున సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 3లోగా వేతనాల పెంపులో స్పష్టత, ఇతర డిమాండ్ల అమలు జరగకపోతే మళ్లీ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని చెప్పారు.అనంతరం రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. నేటి నుంచి యధావిధిగా విధులకు హాజరవుతున్నట్లు వారు చెప్పారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఉమాదేవి, వినోద్‌కుమార్

రాజంపేట రూరల్: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి జీ.ఉమాదేవి పేర్కొన్నారు.. స్థానిక సబ్ కలెక్టర్ సభాభవనంలో మంగళవారం బాలల చట్టాలపై డివిజనల్ స్థాయిలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ వైఖోమ్ విదియా దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జీ.ఉమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.వినోద్‌కుమార్‌లు బాలల పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు జరిపినా, బాలికలను లైంగికంగా వేధించినా కఠినమైన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీఓలు సునంద, సరళ, నిర్మలాజ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, ఏమీఓలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

నీళ్లపై రాజధాని నిర్మిస్తున్నారు

- ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలున్నాయి
- రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆగ్రహం



మాట్లాడుతున్న చింతామోహన్

కడప రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతిలో నీళ్లపై రాజధాని నిర్మిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. మంగళవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో మూరెడు మట్టి తీస్తే.. చారెడు నీళ్లు వస్తున్నాయని తెలిపారు. దేవతల నగరం అంటున్నారని, అక్కడ మాత్రం కర్రతుమ్మ చెట్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 20 జిల్లాల ప్రజల్లో రాజధానిపై అసంతృప్తి ఉందన్నారు. రాయలసీమలో పరిపాలనా రాజధాని, విశాఖపట్నంలో హైకోర్టును ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఆ దిశగా సీఎం చంద్రబాబు ఆలోచించాలని సూచించారు. రాయలసీమలో ప్రాజెక్ట్‌లన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేశాక, బనకచర్ల అంశాన్ని పరిశీలించాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయని, మరో 5 వేల పాఠశాలలను మూత వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 3 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య అందని పరిస్థితి ఏర్పడటం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు అందడం లేదన్నారు. బీటెక్, ఎంబీఏ చదివిన విద్యార్థులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీఎంలపై వస్తున్న విమర్శలు కరెక్టే అన్నారు. తిరుపతి లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కొంతమంది తన వద్దకు వచ్చి.. ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని చెబితే ఆశ్చర్యపోయానని అన్నారు. వారు చెప్పిన కొన్ని ఉదాహరణలు వింటే నిజమే అనిపించిందన్నారు. మోడరన్ టెక్నాలజీ ద్వారా, రిమోట్‌తో టీవీని కంట్రోలు చేసే విధంగా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చని వివరించారన్నారు. అందుకు ప్రతిఫలంగా వారు రాజకీయంగా పెద్ద పెదవినే కోరడంతో వారికి ఒక దండం పెట్టి నాకీ సమస్యలు వద్దని చెప్పానని పేర్కొన్నారు. ప్రతిపక్షం బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో, కీలకమైన ప్రదేశాల్లో ట్యాంపరింగ్ ద్వారా ఓడిపోయే వారిని గెలిపిస్తున్నట్లుగా తెలిసిందన్నారు. అలాగే ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిశ్రమలకు సంబంధించి రూ. 14.50 లక్షల కోట్లు ఎన్‌పీఎల్ అయ్యాయని చింతా మోహన్ అన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం రుణ మాఫీ చేసిందని తెలిపారు. అందుకు గాను 10 శాతం డబ్బును వసూలు చేశారని ఆరోపించారు. గుజరాత్‌కు చెందిన వారికే ఎక్కువగా రుణ మాఫీ జరిగిందన్నారు. ఇందులో లక్షలాది రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు.

ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి



కదిరాయచెర్వులో వేరువనగపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శివనారాయణ

కలకడ: రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టిపెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని నడిమిచెర్ల, కదిరాయచెర్వు పంచాయతీల్లో వేరశనగ పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసేందుకు అవసరమైన వర్షం కురవలేదని, అందువల్ల రైతులు నీటి అవసరాలు తక్కువగా ఉండే ఆముదం, ఉలవ, కంది, అనుములు, అలసందపంటలు సాగుచేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్‌లను 80శాతం రాయితీపై మంజూరు చేయనున్నట్లు చెప్పారు.ఇందుకోసం ఐదుగురు సభ్యులు కమిటీగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మజీద్‌అహమ్మద్, టెక్నికల్ అసిస్టెంట్ నవంత్‌బాబు, ఏఓ శ్రీనివాస్, కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో ప్రయోజనాలు

సంబేపల్లె: జీవన ఎరువులు పంటలకు వాడటం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఏఓ కిషోర్ నాయక్, వ్యవసాయ సిబ్బంది రెడ్డివెంకటరమణ, సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం పీఎం ప్రణామ్ పథకం

జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: రైతుల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం పీఎం ప్రణామ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో పచ్చిరొట్ట జీవన ఎరువుల గోడపత్రికను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా వ్యవసాయ అధికారి జి శివనారాయణలు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం ప్రణామ్ స్కీమ్ ద్వారా ఎరువుల సమతుల్యత వినియోగాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అన్నారు. ఈ పథకం ద్వారా కృత్రిమ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచడమే ఉద్దేశమని, తద్వారా ఆరోగ్యమైన నేలతో పాటు సారం, పోషకాల లభ్యత పెరిగి నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

- వర్షానికి ముందే పచ్చిరొట్ట.. పొడి విత్తనాలు చల్లుకోవడం వల్ల వర్షం పడిన తర్వాత పంట మొలకెత్తడంతోపాటు నేలసారం పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. నత్రజని సంబంధిత జీవన ఎరువు, రైజోబియం, అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లం, భాస్వరం, సంబంధిత జీవన ఎరువు పాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టిరియా, పొటాషియం, రిలీజింగ్ బ్యాక్టిరియా వాడటం వల్ల మొక్కకు పోషకాల లభ్యత పెరుగుతుందని కలెక్టర్ సూచించారు.

» పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలి

మదనపల్లె రూరల్: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా మదనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీలకు, రెవెన్యూ సిబ్బంది సత్వరమే పరిష్కారం దిశగా చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కనపరచి, ఒకవేళ పరిష్కారం కాని సమస్యలు ఉంటే ఎందుకు పరిష్కరించలేకపోయామో ఎండార్స్‌మెంట్ రూపంలో అర్జీదారుడికి అందజేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూమ్ పాతభవనంలో కొనసాగుతుండటం, రూమ్‌లోకి మర్రి ఊడలు చొచ్చుకుని ఉండటంతో వాటిని తొలగించి రికార్డులు భద్రంగా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సు అర్జీల పరిష్కారానికి సంబంధించి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వే ఏడీ భరత్‌కుమార్, మండల తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో ప్రభుత్వ పతనం తప్పదు!



మదనపల్లెలో నోటికి నల్లరిబ్బన్లు, ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

మదనపల్లె: ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేసిన కూటమి ప్రభుత్వ పతనం తప్పదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ వరపన మనూజ అన్నారు. మంగళవారం వారిద్దరి ఆధ్వర్యంలో మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట నోటికి నల్ల రిబ్బన్లను కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వ కుట్ర రాజకీయాలు నశించాలని కోరారు. ఈ సందర్భంగా షమీం అస్లాం, మనూజ మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేసిన కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని అన్నారు. ప్రభుత్వ మద్య విక్రయాలకు మిథున్‌రెడ్డికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మద్యం పాలసీని తీసుకొచ్చింది అప్పటి ప్రభుత్వమైతే..ఎక్సైజ్‌శాఖ పాలనాపరమైన వ్యవహారాలను చూసుకుంటాయన్నారు. పార్లమెంట్ సభ్యుడైన మిథున్‌రెడ్డి ఈ వ్యవహారంలో జోక్యం ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాదు, ప్రభుత్వంలో భాగస్వామ్యంకాని మిథున్‌రెడ్డికి మద్యం పాలసీకి సంబంధం లేదని తెలిసినా కక్షతో రాజకీయం బలహీనపర్చాలన్న లక్ష్యంతో మద్యం అక్రమ కేసులో ఇరికించారన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు ముబీనా, షబానా, లత, రేణుక, సుగుణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బిరంగి రేవతి, మహిళా నాయకులు వినుతబాయి, మేరీ, నాగమణి, అమ్మాజాన్, శ్యామల, మల్లిక, లలితారెడ్డి, మంజుల, అపర్ణ పాల్గొన్నారు.

అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి
- రమేష్‌కుమార్ రెడ్డిని పరామర్శించిన పార్టీ సీనియర్ నాయకులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యం తదితరులు

లక్కిరెడ్డిపల్లి: ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కలిసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, పార్టీ నాయకుడు సుగవాసి బాల సుబ్రమణ్యంలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ గొంతునొక్కే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడటానికి ఎన్ని కేసులైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపైన అక్రమ కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ సలహా మండలి మాజీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ స్టేట్ సెక్రటరీ గాలివీటి వీరనాగిరెడ్డి, రాజంపేట అసెంబ్లీ పబ్లిసిటీ వింగ్ మాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాన్యం సంతోష్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీలు అంబాబత్తిన రెడ్డయ్య, తిమ్మిరెడ్డి ఉమాపతి రెడ్డి, ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న భూదేవి

రామసముద్రం : రామసముద్రం మండలం చొక్కాడ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు భార్య భూదేవి(50) కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇంటిలో నీటి సంపులో వేసే మోటార్ స్విచ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టింది. దీంతో ఆమె వేళ్లు పూర్తిగా కాలిపోయాయి. వెంటనే కుటుంబీకులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నర్సింగ్ కోర్సులు చేసిన వారికి ప్రత్యేక శిక్షణ

రాయచోటి జగదాంబ సెంటర్ : నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి జర్మనీ దేశంలో ఎక్కువగా ఉద్యోగావకాశాలు ఉన్నందున జర్మన్ భాషపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు అన్నమయ్య జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.క్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం మొత్తం 150 మందికి జర్మన్ భాషపై 8 నుంచి 10 మాసాల పాటు శిక్షణ ఇస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం లేదా జీఎన్‌ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన 35 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ మహిళలు అర్హులన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తును స్కాన్ చేసి dscweoanm@gmail.com కు ఈ మెయిల్ చేయాలని సూచించారు.

ప్రహరీ విషయమై ఇరువర్గాల వివాదం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని బొగ్గుడుపల్లె రోడ్డు సమీపంలో ప్రార్థనా మందిరాల ప్రహరీ విషయమై ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. గతంలోనూ ప్రార్థనల విషయమై వివాదం తలెత్తగా పోలీసులు ఇరు వర్గాల వారికి సర్ది చెప్పి పంపారు. తాజాగా మంగళవారం ప్రహరీ విషయమై మరోమారు ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్‌ల సమక్షంలో సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ తెలిపారు.

సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు!

- 27.616 టీఎంసీలు నిల్వ
- డ్యాంలోకి ఇన్‌ఫ్లో 3,055 క్యూసెక్కులు



జలాశయంలోకి చేరుతున్న కృష్ణా జలాలు

రాజంపేట : సోమశిలలోకి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. సోమవారం నమోదైన 3, 055 క్యూసెక్కుల ప్రవాహం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అధికారుల అంచనా కన్నా ముందే జలాలు సోమశిలకు చేరుతున్నాయి. కర్నూలు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో కుందూ నది ద్వారాను కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆదినిమ్మాయపల్లె వద్ద..

ఈ ఏడాది జూలై నెలలోనే కృష్ణానదికి వరదలు ఉధృతంగా వచ్చాయి. దీంతో శ్రీశైలం జలాశయం నిండిన సంగతి విదితమే. సాగర్‌కు నీటిని విడుదల చేశారు. అవి కాస్తా పెన్నా (సిద్దవటం, ఒంటిమిట్ట) ద్వారా సోమశిలకు చేరుతున్నాయి. శ్రీశైలంలో 203.43 టీఎంసీలు ఉండగా, జలాశయంలోకి 1,75,233 క్యూసెక్కులు వస్తోంది. దాంతో తెలుగు గంగకు విడుదలను మరింత పెంచే అవకాశం ఉంది. అదే స్థాయిలో సోమశిలకు రానున్నాయి. కడప జిల్లా ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నాలో 1800 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది.

27.616 టీఎంసీల నిల్వ..

సోమశిలలో 27.616 టీఎంసీల నీటి నిల్వ ఉండగా , కృష్ణా జలాలు జత కావడంతో జలాశయంలోకి 3,055 క్యూసెక్కుల ప్రవాహమే ఉంది. జూలైలో వర్షాల కారణంగా ప్రవాహం క్రమంగా పెరిగే పరిస్థితి ఉంది. సోమశిల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఇన్‌ఫ్లో క్రమంగా పెరిగే అవకాశం ఉందని జలాశయం అధికారులు అంటున్నారు.

వెనుక జలాలు నిలకడగా..

సోమశిల జలాశయం కెపాసిటీ 77.988 టీఎంసీగా ఉంది. జలాశయంలో నీటి మట్టం 90,879 మీటర్ల వద్దకు చేరుకుంది. అన్నమయ్య, కడప జిల్లాలో విస్తరించి ఉన్న అట్లూరు, ఒంటిమిట్ట, నందలూరు మండలాల పరిధిలో వెనుక జలాలు నిలకడగానే ఉన్నాయి.

పోరాటాలకు సమాయత్తం కావాలి



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- బద్వేలులో ప్రారంభమైన సీపీఐ జిల్లా మహాసభలు

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోవు రోజుల్లో లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను కూడగట్టుకుని పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ 25వ జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతున్న మోదీ..

కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పేద ప్రజల, రైతుల, కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కేవలం కార్పొరేట్ వర్గాల సేవలో పరితపిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెలికి తీస్తామని చెప్పిన మోదీ ఇప్పటి వరకు ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో, ఎంత నల్లధనం వెలికి తీశారో సమాధానం చెప్పాలన్నారు. పేదలకు అనుకూలంగా ఆర్థిక విధానాలు రూపొందించాల్సింది పోయి మత విద్వేషాలు సృష్టిస్తూ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న చంద్రబాబు..

గత ప్రభుత్వ హయాంలో చేస్తున్న అప్పులను ఉద్దేశించి రాష్ట్రం శ్రీలంకగా మారిపోతుందని అన్న చంద్రబాబునాయుడు నేడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.1.75 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట, అధికారంలో ఉంటే మరో మాట మాట్లాడటం చంద్రబాబు నైజమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం విద్యుత్ వినియోగదారులపై ఇంత భారం ఏ ప్రభుత్వం మోపలేదన్నారు. చంద్రబాబునాయుడు గతంలో మాదిరిగానే గాలిలో మేడలు కడుతున్నారే తప్ప రాష్ట్రాభివృద్ధిపైన ఏ మాత్రం దృష్టి సారించడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, భాగ్యలక్ష్మి, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ, రూరల్ కార్యదర్శులు బాబు, ఇమ్మానియేలు, ఏరియా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతులకు వెత



వంతాటిపల్లె రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

సిద్దవటం : మండలంలోని రైతులకు యూరియా తగినంత ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె రైతు సేవా కేంద్రానికి 10 టన్నుల యూరియా మంజూరు కావడంతో మంగళవారం వంతాటిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని సంటిగారిపల్లె, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల రైతులు పెద్ద ఎతున యూరియా కోసం ఎగబడ్డారు. బస్తా యూరియా రూ. 270 తీసుకుంటున్నారు. ఒక ఎకరా పొలం ఉన్న రైతులకు ఒక బస్తా ఇస్తున్నారు. 2 ఎకరాలు అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా రెండు బస్తాలు యూరియా ఇస్తామంటున్నారు. అలా ఇస్తే పంటలకు ఎలా సరిపోతుందని అధికారులను నిలదీశారు. అయితే జ్యోతి రైతుసేవా కేంద్రం పరిధిలోని ఖాదర్‌బంగ్లా, జ్యోతి, గొల్లపల్లి, జ్యోతి గ్రామాలకు చెందిన రైతులు కూడా వంతాటిపల్లెకు వచ్చి యూరియా కావాలని అధికారులను కోరారు. దీంతో యూరియా పంపిణీని అధికారులు ఆపేసి జ్యోతి రైతు సేవా కేంద్రానికి కూడా 10 టన్నులు యూరియా రావాల్సి ఉందని అది వచ్చిన తరువాత రెండు రైతు సేవా కేంద్రాల్లో ఒకేసారి పంపిణీ చేస్తామని అధికారులు చెప్పి రైతుసేవా కేంద్రానికి తాళాలు వేసి వెళ్లారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



పార్లు దండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట : రాజంపేట మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం కార్మికులు పార్లు దండాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులతో చర్చించకుండా సోమవారం సొంతంగా జీతాలు పెంచడం అన్యాయమన్నారు. ప్రభుత్వ పథకాలు కార్మికులకు అందజేయాలని అడిగితే ఆ విషయం గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.వి. రమణ, సీహెచ్ ఓబయ్య, ప్రసాద్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో మంగళవారం మధ్యాహ్నం ఎస్ఐ శివప్రసాద్ సిబ్బందితో కలసి బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. బ్రహ్మంసాగర్‌కు వెళ్లేదారిలో ఓ బెల్టు షాపు దుకాణంలోకి వెళ్లగా అక్కడ షాపు నిర్వాహకుడు పరారయ్యాడు. బెల్టుషాపులో 35 క్వార్టర్ బాటిళ్లు, వివిధ రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

– కత్తి, మోటార్ సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

కడప అర్బన్ : కడప నగరం గంజికుంట కాలనీలో గత నెల 25వ తేదీన గొంటుముక్కల వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసిన కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. కడప మాసాపేటకు చెందిన తాటిగిరి అనూష, పాలెం సుబ్బరాయుడు అలియాస్ సుబ్బన్న, చింతకొమ్మదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లికి చెందిన సోమ ప్రశాంత్, సుగమాల నవీన్ అలియాస్ శిగనమాల నవీన్, సిబ్యాల సుబ్బరాయుడు మాసాపేటకు చెందిన తాటిగిరి నిర్మలను అరెస్టు చేసినట్లు తెలిపారు. వెంకటసుబ్బయ్య, తాటిగిరి అనూష మధ్య మనస్పర్థలు ఉన్న నేపథ్యంలో గత నెల 25వ తేదీ వెంకటసుబ్బయ్యపై దాడి జరిగిందన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నథ్ హెగ్డే

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు, కమ్మపల్లి దళిత వాడ గ్రామంలో బొమ్మ ఈశ్వరమ్మ ఇంటిలో చోరీకి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొమ్మ ఈశ్వరమ్మ ఇంటిలో ఈనెల 14వ తేదీన ఆమె బంధువులైన రామసుబ్బమ్మ, రమాదేవి అనే అక్కా చెల్లెళ్లు ఈశ్వరమ్మ ఇంటిలోని బీరువా బీగాలు తీసుకొని లాకర్‌లో ఉన్న తొమ్మిది తులాల బంగారాన్ని దొంగిలించారన్నారు. దొంగలించిన బంగారాన్ని ఇంటి పక్కనే ఉన్న తమలపాకు తోటలో దాచి ఉంచారని తెలిపారు. తన బంగారం చోరీకి గురైనట్లు ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పి.మహేష్ విచారించి దొంగిలించిన బంగారాన్ని రాజంపేట బంగారు దకాణాలలో విక్రయించేందుకు అక్కా, చెల్లెళ్లు ప్రయత్నం చేయగా వారిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న దాదాపు నాలుగు లక్షల రూపాయలు విలువచేసే తొమ్మిది తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ



మద్దిరేవుల పంచాయతీలో చెత్తసేకరణను తనిఖీ చేస్తున్న డీపీఓ రాధమ్మ

లక్కిరెడ్డిపల్లి : పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుధ్యంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలంలోని మద్దిరేవుల గ్రామ పంచాయతీలో ఆమె మంగళవారం చెత్త సేకరణపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామంలోని ఈడిగపల్లి, అప్పలరాజుపల్లి, జీఎంఆర్ కాలనీలలో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. వర్షాకాలం కావడం వల్ల బ్లీచింగ్ పౌడర్, గుంతలలో, చేతి బావుల వద్ద, బోరింగ్ కుళాయిల వద్ద చల్లాలని సిబ్బందికి సూచించారు. గతంలో పాత మూడు చక్రాల చెత్త సేకరణ ట్రాలీని, టీవీఎస్ ద్విచక్ర వాహనంతో అనుసంధానించి అతి తక్కువ ఖర్చుతో చెత్త సేకరణ వాహనం రూపొందించినట్లు పంచాయతీ కార్యదర్శి రజనీష్ రెడ్డి పంచాయతీ అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్, గిరిబాబుతో పాటు గ్రీన్ అంబాసిడర్లు నాగేశ్వర, చంద్రయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో వైద్య, విద్య శాఖల పాత్ర కీలకం

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు



మాదక ద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్ఓ మధుసూదన్ రావు

రాయచోటి : మాదక ద్రవ్యాల నిర్మూలనలో వైద్య, విద్య శాఖల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాయచోటి ఏఎస్పీ వెంకటాద్రితో కలిసి రెవెన్యూ, విద్య, వైద్య, ఎక్సైజ్ తదితర అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సమాజానికి చీడపురుగు వంటివని, వీటి వాడకాన్ని సమూలంగా నివారిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని డీఆర్ఓ అన్నారు. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వైద్య, విద్య తదితర శాఖల సమన్వయంతోనే మాదక ద్రవ్యాలను నిర్మూలించవచ్చన్నారు. కఠిన చర్యలు లేకుంటే దీనిని అరికట్టడం సాధ్యం కాదని ఏఎస్పీకి సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధకానికి వైద్యశాఖ చేట్టిన కార్యక్రమాల మీద ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేసి చూపించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో వాడుతున్న మాదక ద్రవ్యాలు ఏవి, అవి ఎక్కడ అమ్ముతున్నారో జిల్లా వ్యాప్తంగా తనిఖీ నిర్వహించి తెలుసుకోవాలని జిల్లా డ్రగ్స్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర కళాశాలల్లో తప్పనిసరిగా మాదక ద్రవ్యాల నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేసి వాటి పనితీరును పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలల చుట్టూ 100 మీటర్ల దూరం వరకు సిగరెట్లు, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు ఉన్నాయన్నారు. పోలీస్ శాఖ, ఈగల్ వ్యవస్థలతో సమన్వయం చేసుకొని మాదక ద్రవ్యాలు అమ్ముతున్న ప్రదేశాలలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహ ధ్వంసంపై సీఎం స్పందనేదీ.?



సమావేశంలో మాట్లాడుతున్న బాస్ కేంద్ర కమిటీ సభ్యులు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధవిహార్‌లోని బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసి తలను వేరుచేసిన ఘటన జరిగి 20 రోజులవుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధాకరమని బాస్ కేంద్ర కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భారతీయ అంబేద్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం.శివప్రసాద్ నివాసంలో, ఆ సంస్థ ముఖ్య ప్రతినిధులు సమావేశమయ్యారు. బాస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉలగనాథన్ గణపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుద్ధుడి విగ్రహం తలను తొలగించి, ధ్వంసం చేసిన అనంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలపై చర్చించారు. బుద్ధ విగ్రహ ధ్వంసంపై కేసు దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేయడం చేతకాక, నిరసన తెలిపిన బౌద్ధాభిమానులపై తప్పుడు కేసులు పెట్టించి, వేధింపులకు గురిచేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై చర్యలు లేకపోవడంపై ప్రశ్నించారు. నిందితులను గుర్తించి, అరెస్టు చేయడంలో పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరం చేసిన వారిని వదిలేసి, న్యాయం కోరుతున్న బాస్ ప్రతినిధులపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై కేసు నమోదు డిమాండ్ చేస్తూ, రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బుద్ధ – అంబేద్కర్ – వామపక్ష – ప్రజా సంఘాలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 9న మదనపల్లెలో జరిగే బౌద్ధుల 'ధమ్మ నిరసన'కు వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షులు, చిదంబరం ఎంపీ. డాక్టర్.తోల్.తిరుమావళవన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు కె.వి. రమణ, ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, రాష్ట్ర కార్యదర్శులు టి.ఎ. పీర్ బాషా, బాలకృష్ణ, విజయ్ కుమార్, చాట్ల బయన్న, రవిశంకర్, రెడ్డెప్ప, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిమెంటు ఒకరి పేరుతో.. పనులు చేసేది మరొకరు



ESTIMATE COST	Rs. 2.00 Lakhs
SCHEME	Fifteenth Finance commission Grants (MP share)
AGREEMENT NO & DATE	[illegible]
E.M.D. DETAILS - 2½%	Should be recovered in CC 1st Part Bill
F.S.D DETAILS	
A.S.D DETAILS	–
0.10% Bldg. Fund (HAC-E.10%)	Should be recovered in running bills

వీఎల్‌డబ్ల్యూసీ పేరుతో జరిగిన అగ్రిమెంట్ కాపీ

పెనగలూరు : అగ్రిమెంటు ఒకరి పేరుతో ఉన్నప్పటికీ దౌర్జన్యంగా సిమెంటు రోడ్డు వేసేందుకు కూటమి నాయకులు కంకర తోలుతున్నారు. వివరాలిలా.. నారాయణ నెల్లూరు పంచాయతీలో ఆరు లక్షల రూపాయలతో వీఎల్‌డబ్ల్యూసీ పేరుతో పంచాయతీలో, మండలంలో అగ్రిమెంట్ చేసుకొని పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే రెండు రోజుల క్రితం కూటమి నాయకులు దౌర్జన్యంగా సిమెంటు రోడ్డును తామే వేస్తామని కంకర తోలారు. అగ్రిమెంటు ఎవరు చేసుకుంటే వారే ఆ పనులు చేయాల్సి ఉంటుంది. ఇతర నాయకులు ఎవరు పనులు చేసినా ఆ బిల్లులు అగ్రిమెంట్ చేసుకున్న వారి పేరుతోనే అకౌంట్‌లో వేస్తారు. అయితే అగ్రిమెంట్ లేకపోయినా పనులు ఎలా చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నారాయణ నెల్లూరులోనే కాకుండా మండలంలో పలు చోట్ల కూటమి నాయకుల దౌర్జన్యాలు మితిమీరి పోతున్నాయి.

ఎంపీడీఓ వివరణ..

నారాయణ నెల్లూరు గ్రామంలో అగ్రిమెంటు ఎవరి పేరుతో ఉంటే వారే రోడ్డు వేయాల్సి ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ విషయంపై కంకర తోలిన వారికి చెప్పామన్నారు. ఒకవేళ కంకర తోలిన వారే పనులు చేయాలంటే పంచాయతీలోనూ, మండలంలోనూ అగ్రిమెంటు చేసుకుంటే తప్పా వారు ఆ పనులు చేసేందుకు వీలు పడదని చెప్పారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి



మృతి చెందిన ఖాదర్‌ఖాన్

పీలేరురూరల్ : వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శశి ఆర్థో హాస్పిటల్‌లో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం కేవీపల్లెకు చెందిన పి. ఖాదర్ ఖాన్ (47) పీలేరు ట్రాన్స్‌కో కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పీలేరు పట్టణంలోని శ్రీ లక్ష్మీ హాస్పిటల్‌లో చేరాడు. పరిశీలించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నాయని శశి ఆర్థో హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. సోమవారం శశి హాస్పిటల్‌లో చేరాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి నుంచి కిడ్నీ శస్త్రచికిత్స వైద్య నిపుణులు వచ్చి ఆపరేషన్ చేశారు. అయితే మంగళవారం సాయంత్రం ఖాదర్‌ఖాన్ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నిండుప్రాణం పోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ శశిభూషణ్‌రెడ్డిని వివరణ కోరగా ఆపరేషన్ చేసి 24 గంటలైందని, ఇక డిశ్చార్జి చేయాలనుకున్న సమయంలో మృతి చెందాడని తెలిపారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య తోపాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి





రైల్వే ట్రాక్‌పై మృతదేహం, కడప రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1పై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని కడప రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్ తూర్పు వైపున ప్రయాణికులు కూర్చొనే స్టాండ్‌పై మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడు యాచకునిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, గుర్తించిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉప్పరపల్లె రైల్వే ట్రాక్ వద్ద..

సిద్దవటం: ఉప్పరపల్లె గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గురు తెలియని వ్యక్తి మృతదేహం(55) లభ్యమైంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఇతను రెండు రోజుల కింద మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఇతను ప్రమాద వశాత్తు రైలులోనుంచి కింద పడ్డాడా, లేదా ఎవరైనా చంపి పడేశారా అనే కోణంలో విచారిస్తున్నట్లు కడప రైల్వే ఎస్ఐ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు సుబ్రమణ్యం

నందలూరు : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న రాజంపేట మండలం రేణింతల అరుంధతివాడకు చెందిన పాటూరు సుబ్రమణ్యం అలియాస్ మణిని అరెస్టు చేసి తిరుపతి ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం కేసులో నిందితుడిగా ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ ఇచ్చిందన్నారు. అతన్ని తమ సిబ్బంది పట్టుకొని తిరుపతి స్పెషల్ ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్ జైలుకు తరలించిందన్నారు.